క్లుప్తంగా

డ్రగ్స్‌పై యువతకు అవగాహన

గూడూరురూరల్ : జిల్లా ఎయిడ్స్, డ్రగ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు కామెల్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం గూడూరు పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా అవగాహన కల్పించారు. ప్రాజెక్ట్ మేనేజర్ సుహాసిని మాట్లాడుతూ హెచ్.ఐ.వి/ఎయిడ్స్, డ్రగ్స్ బారిన పడకుండా యువత జాగ్రత్త వహించాలని, వాటిపట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. హెచ్.ఐ.వి/ఎయిడ్స్‌పై వివరిస్తూ టోల్ ఫ్రీ నెంబర్ –1097 గురించి వివరించారు.

పిడుగుపాటుకు ఆవు మృతి

పెళ్లకూరు : పెళ్లకూరు సమీపంలోని వ్యవసాయ పొలంలో సోమవారం పిడుగుపాటుకు గురై గంధం గుప్తకుమార్‌కు చెందిన ఆవు మృతి చెందింది. సుమారు రూ.80వేల విలువైన ఆవు మృత్యువాత పడడంతో జీవనోపాధి పోయిందని బాధితుడు వెల్లడించాడు.ఈ మేరకు పశు సంవర్ధక శాఖ, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాడు.

వేద మంత్రోచ్చరణలతో లక్ష్మీ హోమం



ఆలయంలో పూజలు చేస్తున్న పురోహితులు

చిట్టమూరు: మండలంలోని మల్లాం గ్రామంలో స్వయంభువుగా కొలువైన శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా సోమవారం వేద మంత్రోచ్చరణతో లక్ష్మీ హోమం నిర్వహించారు. ఉదయం ఆలయంలో గణపతి హోమం, అస్త్ర హోమం, నవగ్రహ హోమం, గోపూజను భక్తి శ్రద్ధలతో జరిపారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి, అమ్మవార్లకు పవిత్రాల సమర్పణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు అర్చకుడు మూలంరాజు భానుప్రకాష్ శర్మ తెలిపారు.

రాష్ట్రానికి తీరని అన్యాయం

గూడూరురూరల్ : ప్రధాని మోదీ అనాలోచిత నిర్ణయాల వల్ల రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్ అన్నారు. గూడూరు పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన హామీలను తుంగలో తొక్కి విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేసేందుకు పన్నాగాలు పన్నుతున్న నరేంద్ర మోదీ ఏ ముఖం పెట్టుకుని రాష్ట్ర పర్యటనకు వస్తున్నారని ఎద్దేవా చేశారు. కర్నూలు జిల్లాలో ప్రధాని మోదీ పర్యటనను అడ్డుకుంటామన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జి.శశికుమార్, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి నారాయణ, చిల్లకూరు మండల కార్యదర్శి రమేష్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు సునీల్, మీరాభాయ్, వెంకటయ్య పాల్గొన్నారు.

నీటి సరఫరాకు అంతరాయం



పైపులైన్ పగిలి పోయి వృథాగా పోతున్న నీరు

చిల్లకూరు: గూడూరు పట్టణవాసులకు మంగళవారం తాగునీటి సరఫరాలో కొంత అంతరాయం ఉంటుందని దీనిని గుర్తించి పట్టణ వాసులు పొదుపుగా నీటిని వాడుకోవాలని గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు సోమవారం కోరారు. గూడూరు పట్టణానికి తాగునీటిని కండలేరు డ్యాం నుంచి అందించే పైపులైన్ చెన్నూరు సమీపంలో పగిలి పోయిన కారణంగా మరమ్మతులు చేస్తున్నామన్నారు. దీని వల్ల పట్టణ వాసులకు తగినంత నీటిని అందించే పరిస్థితి లేదని దీనిని గుర్తించి పట్టణ వాసులు తాగునీటిని పొదుపుగా వాడుకుని సహకరించాలని ఆయన కోరారు.

పశువైద్య శిబిరాలతో ఎంతో ఉపయోగం



పశువులకు పరీక్షలు చేస్తున్న పశువైద్యులు

రాపూరు: పాడి రైతులకు మేలు చేకూరేలా పశువైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు నెల్లూరు డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ నాగమణి పేర్కొన్నారు. మండలంలోని ఏపూరు గ్రామంలో సోమవారం జిల్లా పశుగణాంక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రీయ గోకుల మిషన్ సహకారంతో పశు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడు తూ 171 పశువులకు గర్భకోశవ్యాధి చికిత్సలు, దూడలకు నట్ట నివారణ మందులు, పాడిపశువులు కట్టుకు రావడానికి మినరల్ మిక్చర్ ప్యాకెట్లు, లివర్ టానిక్‌ను అందించినట్లు వివరించారు.

చికెన్ ధరలు		14-10-2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	120
లేయర్ లైవ్	:	122
బ్రాయిలర్ చికెన్	:	218
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	240
లేయర్ చికెన్	:	207

వెంకటగిరిలో నిరసన తెలుపుతున్న మహిళా కార్యకర్తలు, నాయుడుపేటలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నేతలు





నారా మద్యంపై నారీ యుద్ధం

- మహిళల పుస్తెలు తెంచుతున్న కూటమి ప్రభుత్వం
- కల్తీ మద్యం నిర్మూలించాలని నినదించిన మహిళలు
- మహిళా కార్యకర్తలను అడ్డుకున్న ఎక్సైజ్‌శాఖ అధికారులు

సైదాపురం/వెంకటగిరి రూరల్ : కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి కల్తీ మద్యం తెచ్చి ప్రాణాలు తీస్తుండడంతో నారీలోకం యుద్ధభేరి మోగించిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కోడూరు కల్పలత విమర్శించారు. మహిళా విభాగం వెంకటగిరి నియోజకవర్గ అధ్యక్షురాలు కాటూరు రామతులసి ఆధ్వర్యంలో సోమవారం 'ప్రాణం తీస్తున్న కల్తీ మద్యం' కార్యక్రమాన్ని వెంకటగిరిలో నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని వెంకటగిరి పట్టణ, రూరల్, బాలాయపల్లి, డక్కిలి, రాపూరు, సైదాపురం, కలువాయి మండలాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో నేదురుమల్లి నివాసం వద్దకు చేరుకున్నారు. అనంతరం ప్లకార్డులతో నేదురుమల్లి నివాసం నుంచి ప్రొహిబిషన్ ఎండ్ ఎక్సైజ్‌శాఖ స్టేషన్ వరకు మహిళలు ర్యాలీ చేశారు. ఎక్సైజ్ స్టేషన్ వద్దకు ర్యాలీ చేరుకుంది. అయితే లోపలకు అనుమతి లేదంటూ స్థానిక పోలీసులు మహిళ కార్యకర్తలను అడ్డుకున్నారు. దీంతో మహిళలు స్టేషన్ ఎదుటే నేలపై భైఠాయించి కల్తీ మద్యం బాటిళ్లను ప్రదర్శించారు. విధిలేని పక్షంలో ఎక్సైజ్ సీఐ సూర్యనారాయణ స్టేషన్ నుంచి బయటకు వచ్చి మహిళల నుంచి వినతి పత్రం తీసుకున్నారు. కల్పలత మాట్లాడుతూ రాష్ట్రంలో విచ్చల విడిగా కల్తీమద్యం ఏరులై పారుతోందన్నారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకుంటున్న చంద్రబాబు సొంత జిల్లాలో భారీగా స్థాయిలో కల్తీ మద్యంను అధికారులు గుర్తించినట్లు తెలిపారు. ఇవి తెలియని అమాయక ప్రజలు కల్తీ మద్యం తాగి ప్రాణాలు పోగొట్టుకుంటున్నట్లు విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు అధికారికంగా 420 మంది కల్తీ మద్యం కారణంగా మృత్యువాత పడినట్లు తెలియజేశారు. ఈ కుటుంబాలు ప్రస్తుతం వీధిన పడ్డాయని దీనికి ప్రభుత్వమే కారణమన్నారు.

ఎక్సైజ్ శాఖ నిద్రావస్థలో ఉందా?

వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు కాటూరు రామతులసి మాట్లాడుతూ గ్రామాల్లో ఎనీటైం లిక్కర్ ప్రజలకు అందుబాటులో ఉంచి వారి కుటుంబాలను సర్వనాశనం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ చర్యలను అరికట్టాల్సిన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ అధికారులు నిద్రావస్థలో ఉందా..? మాముళ్ల మత్తులో ఉండి నిద్ర నటిస్తున్నారా? అర్థం కావడంలేదని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, వైస్ చైర్మన్ సేతరాసి బాలయ్య, మున్సిపల్ విప్ పూజారి లక్ష్మి, కౌన్సిలర్ కందాటి కల్యాణి, సర్పంచ్‌ల సంఘం నియోజకవర్గ అధ్యక్షురాలు చప్పిడి కాయత్రి, బాలాయపల్లి మండల వైస్ ఎంపీపీ వాన పార్వతి, మహిళా విభాగం నాయకురాలు జలగం కామక్షి, కల్లు మల్లీశ్వరి, రమాదేవి, కృష్ణవేణి, కౌన్సిలర్లు ఎంఏ నారాయణ, ఆరి శంకరయ్య, నాయకులు కందాటి రాజారెడ్డి, పూజారి శ్రీనివాసులు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు తుమ్మూరు మస్తాన్, ములవాయిల వెంకటేశ్వర్లు, అలం సాయి, శ్రీనివాసులరెడ్డి, వెంకటేశ్వర్లు పార్టీ మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీబీఐతో దర్యాప్తు జరిపించాలి : కిలివేటి

నాయుడుపేటటౌన్ : రాష్ట్రంలో ఇష్టారాజ్యంగా జరుగుతున్న నకిలీ మద్యం దందాపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య డిమాండ్ చేశారు. ఆయనతోపాటు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, పార్టీ మహిళా నేతలతో కలిసి సోమవారం ర్యాలీ చేశారు. పట్టణంలోని పార్టీ క్యాంపు కార్యాలయం నుంచి వాహనాల్లో ర్యాలీగా బయలుదేరి ఎక్సైజ్ కార్యాలయం సమీపంలోని జాతీయ రహదారి వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి కూటమి తీరును నిరసిస్తూ మహిళలు నాయకులు ప్లకార్డులు చేత పట్టుకుని నినదించారు. ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కార్యాలయం ముందు నిల్చుని ధర్నా చేపట్టి నిరసన తెలిపారు. నకిలీ మద్యంతో పట్టుబడిన కూటమి నాయకులను అరెస్టు చేయాలని, బెల్టు షాపులను తొలగించాలని కోరుతూ ఎక్సైజ్ సీఐ అరుణకుమారి, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ బాలకృష్ణకు వైఎస్సార్‌సీపీ మహిళా నేతలతో కలిసి నాయకులు వినతి పత్రాలందించారు. సంజీవయ్య విలేకరులతో మాట్లాడుతూ పేద ప్రజల ప్రాణాలు పణంగా పెట్టి కల్తీ మద్యంతో కూటమి నాయకులు కోట్లాది రూపాయలు ఆర్జిస్తున్నారని విమర్శించారు. పార్టీ రాష్ట్ర మహిళా కార్యదర్శి నాయుడుపేట ఎంపీపీ కురుగొంధ ధలనక్ష్మీ, ఓజిలి ఎంపీపీ గడ్డం అరుణ రెడ్డి, పెళ్లకూరు జెడ్పీటీసీ ప్రిస్కిల్లా మాట్లాడుతూ నకిలీ మద్యం గ్రామాల్లో ఏరులై పారిస్తూ మహిళలకు కడుపు కోత మిగుల్చుతున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు కిషోర్ యాదవ్, పాదర్తి హరినాథ్ రెడ్డి, శేఖర్ రెడ్డి, సునీల్ రెడ్డి, వివిధ విభాగాల నాయకులు కటకం జయరామయ్య, బైనా మల్లికార్జున రెడ్డి, మద్దాలి సోమశేఖర్ రెడ్డి, గంధవల్లి సిద్దయ్య, ఈదా రత్నశ్రీ, వైస్ ఎంపీపీ నెలవల మమత, ముస్లిం మైనారిటీ నాయకులు షేక్ షబ్బీర్, కింగ్‌స్టే జిలాని, రహమతుల్లా, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



నాయుడుపేట: ఎక్సైజ్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సంజీవయ్య



వెంకటగిరి: సీఐకి వినతి పత్రం సమర్పిస్తున్న కల్పలత, రామతులసి



వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను అడ్డుకుంటున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ అధికారులు

పాఠశాలకు ల్యాబ్ పరికరాల వితరణ



ల్యాబ్ పరికరాలను అందజేస్తున్న దాతలు

సూళ్లూరుపేట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలకు రూ.70 వేలు విలువ చేసే ల్యాబ్ పరికరాలను సోమవారం అందించారు. పూర్వపు విద్యార్థుల సంఘం కార్యనిర్వాహక కమిటీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. కోటపోలూరుకు చెందిన కోగిలి జయరామిరెడ్డి (కేజేఆర్) ట్రస్టు చైర్మన్ కే సురేష్‌రెడ్డి సుమారు రూ.70 వేలు విలువ చేసే ల్యాబ్ పరికరాలను అందజేశారు. జూనియర్ కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్, అదనపు గదుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని పూర్వపు విద్యార్థుల సంఘం తీర్మానించింది. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థుల సంఘం గౌరవాధ్యక్షులు శ్రీసిటీ అధినేత రవీంద్ర సన్నారెడ్డి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ ఆదూరి శ్రీనివాసులు, ఎన్ శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు శివకుమార్‌రెడ్డి,త ధనంజయరెడ్డి, జాయింట్ సెక్రటరీ షేక్ ఉస్మాన్ బాషా, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పొర్లుకట్టలు తెగ్గొట్టకుండా అడ్డగింత



పొర్లుకట్టలను తెగ్గొట్టకుండా అడ్డుకున్న గ్రామస్తులు

నాయుడుపేటటౌన్ : మండల పరిధిలోని చిగురుపాడు గ్రామంలో స్వర్ణముఖి నది వద్ద పొర్లుకట్టలు తెగ్గొట్టేందుకు కొంత మంది పూనుకోవడంతో గ్రామస్తులు సోమవారం అడ్డుకున్నారు. చిగురుపాడు గ్రామంలో స్వర్ణముఖి నదికి ఐదు చోట్ల పొర్లుకట్టలను తెగ్గొట్టారని గ్రామస్తులు కొద్దిరోజుల కిందట రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో తెగ్గొట్టిన పొర్లుకట్టల వద్ద అధికారులు మట్టి పోసి యథావిధిగా అడ్డుకట్టలను నిర్మించి ఇసుక అక్రమ రవాణా చేపట్టకుండా చర్యలు చేపట్టారు. అయితే అక్రమార్కులు సోమవారం ఆ పొర్లుకట్టలను తెగ్గొట్టేందుకు జేసీబీ తీసుకుని రావడంతో గ్రామస్తులు అడ్డుకున్నారు.

రూ.1.8 కోట్లతో ఉపాధి పనులు

చిల్లకూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలోని కలవకొండ గ్రామంలో 2026–27 ఆర్థిక సంవత్సరంలో రూ.1.8 కోట్లతో ఉపాధి పనులు చేపట్టేందుకు గుర్తించినట్లు ఏపీఓ గిరిబాబు తెలిపారు. మండలంలోని కలవకొండ గ్రామంలో సోమవారం గ్రామసభను నిర్వహించి చేయాల్సిన పనులను ఆమోదింప చేశారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

బాలాయపల్లి(సైదాపురం): మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నారాయణ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పీఆర్‌ఓ నందకిషోర్ పేర్కొన్నారు. వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి నెల్లూరు నారాయణ వైద్యశాలలో చికిత్స అందించనున్నట్లు వివరించారు.

విద్యార్థులకు కళాచిత్ర అవార్డులు

- మన్నారుపోలూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో కలెక్టర్ చేతుల మీదుగా ప్రదానం



విద్యార్థినికి కళాచిత్ర పురస్కారాన్ని అందిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

సూళ్లూరుపేట: పట్టణంలోని మన్నారుపోలూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు కళాచిత్ర పురస్కారాలను కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్, శ్రీసిటీ అధినేత రవీంద్ర సన్నారెడ్డి చేతులమీదుగా సోమవారం సాయంత్రం అందజేశారు. పదో తరగతిలో మొదటిస్థానం సాధించిన రామిశెట్టి మౌనికకు రూ.20 వేలు, ద్వితీయ స్థానం సాధించిన వేలూరు చేతనకు రూ.15 వేలు, తృతీయస్థానం సాధించిన గులపాల కీర్తికి రూ.10 వేలు నగదు బహుమతులను అందజేశారు. ఆర్ ఎం ఆంజనేయులు–రాజమునెమ్మ, ఆర్ఎంఎస్ ప్రకాష్‌బాబు–స్వరాజ్యలక్ష్మి స్మారకంగా కళాచిత్ర అవార్డులు అందజేశారు. ఆర్ ఎంపీ భాస్కర్‌బాబు రాసిన కవిత్వం ౙ మూడో కన్ను₹₹ కవితా సంపుటిని రవీంద్ర సన్నారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. తొలి కాపీని కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ అందుకున్నారు. రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ వచ్చే ఏడాది నుంచి కళాచిత్రతో పాటు తాను కూడా మూడు పురస్కారాలనను అందజేస్తానని ప్రకటించారు. కళాచిత్ర కుటుంబ సభ్యులతో పాటు భాస్కర్‌బాబు–రాధమ్మ, ఉమామహేశ్వరరావులను విశ్రాంత ఉపాధ్యాయులు మల్లిశెట్టి శివప్రసాద్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరు ఆర్డీవో కిరణ్మయి, హెచ్‌ఎం రాజశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

అసంపూర్తిగా వున్న గదులను పూర్తి చేస్తాం

జిల్లా పరిషత్ హైస్కూల్‌కి విచ్చేసిన జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ముందుగా స్కూల్‌ను పరిశీలించారు. అసంపూర్తిగా ఆగిపోయిన 8 గదుల గురించి వాకబు చేసి వాటిని పూర్తి చేయడానికి సహకరిస్తానని చెప్పారు. గ్రామస్తులు శ్మశాన వాటిక సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన స్పందించి శ్మశాన స్థల సమస్యపై ఆర్డీవోకు వివరించి ఈ సమస్యను పరిష్కరించాలని ఆదేశాలిచ్చారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు

ఓజిలి: మండల పరిషత్ కార్యాలయంలో ఓఎస్‌ఆర్ (ఓన్ సోర్స్ రెవెన్యూ) మంగళవారం నుంచి రెండు రోజుల శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నారాయణరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

యూరియా కార్డులు పంపిణీ

వాకాడు: మండలంలోని రైతులకు యూరియా కార్డులు పంపిణీ చేయనున్నట్లు ఎంఏఓ దీప తెలిపారు. ఆమె సోమవారం రెడ్డిపాళెం బిట్–1, బిట్ –2, పంబలి, యరగాటిపల్లి గ్రామ రైతు సేవా కేంద్రాల రైతులకు యూరియా పంపిణీ కార్డులు అందజేశారు. మిగిలిన రైతు సేవా కేంద్రాల పరిధిలోని రైతులకు వారం రోజుల్లో ఈ కార్డులు అందజేయనున్నట్లు వివరించారు.

ఎడ్లబండిని ఢీకొన్న బైక్

నాయుడుపేటటౌన్: ఎడ్లబండిని బైక్ ఢీకొనడంతో వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, నెల్లూరు కోటమిట్ట ప్రాంతానికి చెందిన షేక్ కరీముల్లా బైక్‌పై నెల్లూరు నుంచి నాయుడుపేట వైపు బయల్దేరారు. మార్గ మధ్యలో మూర్తిరెడ్డి పాళెం గ్రామ సమీపాన అదుపు తప్పి ఎడ్లబండిని ఢీకొంది. తీవ్రంగా గాయపడిన కరీముల్లాను నెల్లూరు ఆస్పతికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆక్రమణలు తొలగించండి

కోట: ఆక్రమణలకు గురవుతున్న శ్మశాన వాటిక స్థలాన్ని కాపాడాలని కోట పంచాయతీ పరిధిలోని శ్రీ లక్ష్మమ్మ గిరిజన కాలనీవాసులు సోమవారం తహసీల్దార్ జయజయరావుకు ఫిర్యాదు చేశారు. కోటక్రాస్‌రోడ్డు సమీపంలోని చల్లకాలువ వద్ద గిరిజనులకు శ్మశాన వాటిక కోసం గతంలో అధికారులు స్థలాన్ని కేటాయించారు. అయితే కొందరు కొంతమేర ఆ భూమిని ఆక్రమించేందుకు యంత్రాలతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఆక్రమణలకు గురి కాకుండా భూమిని కాపాడాలన్నారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ గిరిజనులకు శ్మశాన వాటిక కోసం కేటాయించిన స్థలాన్ని సర్వే చేయించి వారికి అప్పగిస్తామని తెలిపారు.

ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ

గూడూరురూరల్ : మండలంలోని కుందకూరు గ్రామంలో పద్మశ్రీ మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు సోమవారం సాయంత్రం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) జెండాను గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. దీనికి తిరుపతి జిల్లా అధికార ప్రతినిధి గొల్లపల్లి సిసింద్రీ మాదిగ చేతుల మీదుగా జెండాను ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ సీజేపై దాడికి యత్నాన్ని ఖండిస్తూ ఈనెల 17న మండల కార్యాలయంవద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

వెంకటగిరి రూరల్: పట్టణంలోని వెలమపాళెంలో ఉన్న శ్రీలక్ష్మి నరసింహ కల్యాణ మండపంలో 1974 ఎస్ఎస్‌సీ ఆర్వీఎం పాఠశాల పూర్వ విద్యార్థులు సోమవారం సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ ఇప్పటికే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని భవిష్యత్తులో ఇంకా విస్తృతం చేయనున్నట్లు తెలియజేశారు.

అరకొర అధికారులతోనే గ్రీవెన్స్‌డే



గ్రీవెన్స్‌డేలో అర్జీలను పరిశీలిస్తున్న అధికారులు

దొరవారిసత్రం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్థానిక తహసీల్దార్ శైలకుమారి ఆధ్వర్యంలో జరిగిన గ్రీవెన్స్‌డేకు పూర్తి స్థాయిలో అధికారులు హాజరుకాకపోగా కొన్ని శాఖల అధికారులు చుట్టపు చూపుగా వచ్చి వెళ్లిపోతున్నారు. మండల కేంద్రంలో అందుబాటులో ఉన్న పలు శాఖల అధికారులు సైతం గ్రీవెన్స్ డేకు హాజరు కాకపోవడం గమనార్హం. సోమవారం జరిగిన గ్రీవెన్స్‌డేలో పలువురు వృద్ధులు పింఛన్ల కోసం, పలు ప్రాంతాలకు చెందిన రైతులు వివిధ భూ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గోవర్ధన, ఏఈలు వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, ఏపీఎం మునిరాజ, సూపర్‌వైజర్ అంకమ్మ పాల్గొన్నారు.

చెట్ల తొలగింపుతో ఉపాధి కోల్పోతున్నాం



అధికారులతో మాట్లాడుతున్న గీత సొసైటీ సభ్యులు

చిల్లకూరు : తాటి, ఈత చెట్లను తొలగించడం ద్వారా తాము ఉపాధి కోల్పోతున్నామని కల్లు గీత కార్మికులు తమ్మినపట్నం గ్రామ సర్పంచ్ నెల్లిపూడి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సోమవారం అధికారులకు వినతి పత్రాలు అందించారు. వారు మాట్లాడుతూ మండల తీర ప్రాంతంలోని తమ్మినపట్నం రెవెన్యూ పరిధిలో విస్తారంగా తాటి, ఈత చెట్లు ఉన్నాయన్నారు. వీటిని ఆధారంగా చేసుకుని తమ్మినపట్నం, లింగవరం, పల్లెవాని దిబ్బ, తాళ్లబైట, తీగపాళెం గ్రామాల్లోని సుమారు 200 మంది ఎస్సీ, గౌడ, యాదవ, వర్గానికి చెందిన వారు ఒక సొసైటీగా ఏర్పడి ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొంది ఎన్నో ఏళ్లుగా కల్లు గీసుకుని దాని ద్వారా వచ్చిన ఆదాయంతో కుటుంబాలను పోషించుకుంటున్నామని తెలిపారు. అయితే ఇటీవల ఓ కంపెనీకి చెందిన వారు సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు భూములు తీసుకుని అందులో ఉన్న చెట్లను పూర్తిగా తొలగించేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే సుమారు 150 చెట్ల వరకు తొలగించారని వివరించారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ కంపెనీ ప్రతినిధులతో ఫోన్‌లో మాట్లాడి కల్లుగీత కార్మికులతో ఒక సమావేశం ఏర్పాటు చేసి ఆటు తరువాత వారి ఇష్టం మేరకు పనులు చేపట్టాలని సూచించారు. గూడూరు ఎక్సైజ్ అధికారులను కలసి విన్నవించగా వారు కూడా కంపెనీ ప్రతినిదులతో మాట్లాడి సొసైటీలోని సభ్యులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.


మనోహర్ మృతికి వైఎస్సార్ సీపీ నేతల నివాళి

చిట్టమూరు: మండల పరిధిలోని తంబుగారిపాళెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత, వాకాడు ఏఎంసీ మాజీ డైరెక్టర్ చింతలమూడి మనోహర్ మృతికి పలువురు వైఎస్సార్ సీపీ నేతలు నివాళులర్పించారు. సోమవారం స్వగ్రామానికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో వాకాడు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఏనుగు సుధాకర్ నాయుడు, వైస్ ఎంపీపీ, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి బీవీ రమణయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యుడు సంక్రాంతి కస్తూరయ్య, ఆశ శ్రీనివాసులు ఉన్నారు.


ఈకేవైసీ చేసుకోవాలి

గూడూరురూరల్ : భారత్ గ్యాస్ వినియోగదారులు ఈ నెల 31వ తేదీ లోపు ఈకేవైసీ చేసుకోవాలని గూడూరు పట్టణంలోని ఓం శ్రీసాయి సత్యం ఓబులేష్ భారత్ గ్యాస్ ఏజెన్సీ డీలర్ సుచిత్రాదేవి తెలిపారు. గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ చేయించుకోకపోతే గ్యాస్ సిలిండర్ల సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. గ్యాస్ వినియోగదారులు ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం వద్ద ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు

ట్యాంకర్ బోల్తా: డ్రైవర్ దుర్మరణం



మృతి చెందిన డ్రైవర్ మణి



బోల్తా పడిన వాటర్ ట్యాంకర్

నాయుడుపేటటౌన్ : మండలంలోని మేనకూరు సెజ్ పరిధిలో రహదారిపై సోమవారం ట్రాక్టర్ ట్యాంకర్ బోల్తా పడి డ్రైవర్ బండి మణి(26) మృతి చెందాడు. వివరాలు.. గూడూరు రూరల్ మండలం పోటుపాళెం గ్రామానికి చెందిన మణి ఓజిలి మండలం మూమ్మయ పాళెంలో నివసిస్తూ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మేనకూరు సెజ్ పరిధిలోని పరిశ్రమలకు ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నాడు. ఈ క్రమంలో ఓ పరిశ్రమ నుంచి వస్తుండగా ప్రమాదం జరిగింది. ఎస్ఐ ఆదిలక్ష్మి ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.